నాణ్యత తారుమారు

- గుంతల పూడ్చివేతలో గాలికొదిలేసిన నాణ్యత
- ఐదు నెలలకే మళ్లీ గుంతలు దర్శనం



నూజివీడు-మైలవరం రోడ్డులో మరమ్మతులు చేపట్టిన చోట ఐదు నెలలకే పడిన గుంతలు



నూజివీడు-విస్సన్నపేట రోడ్డులో పట్టణంలో మరమ్మతులు చేసిన చోట పడుతున్న గుంతలు

నూజివీడు: కూటమి ప్రభుత్వంలో నూతన రోడ్ల నిర్మాణం గాని, తారురోడ్ల గుంతలు పూడ్చే విషయంలో గాని నాణ్యత కొరవడింది. తారురోడ్లకు చేసిన మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటగా మారడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైందనే విమర్శలు పెద్దఎత్తున వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సంక్రాంతి నాటికి తారురోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని లక్ష్యాన్ని నిర్దేశించి పనులు చేపట్టింది. నూజివీడు నియోజకవర్గంలో ఈ పనులు ఫిబ్రవరి, మార్చి నెల వరకు కొనసాగాయి. అయితే పనిచేసి ఐదు నెలలు కూడా గడవకముందే పూడ్చిన గుంతల్లోని తారు, కంకర లేచిపోయి మరలా గుంతలు ఏర్పడ్డాయి. దీనిని బట్టే తారురోడ్ల మరమ్మతు పనులు ఎంత నాణ్యతగా జరిగాయో తేటతెల్లమైంది. కాంట్రాక్టర్లు అధికార పార్టీకి చెందిన వ్యక్తులే కావడంతో ఇష్టారాజ్యంగా ఈ పనులు నిర్వహించారు. పనుల నాణ్యతపై ఆర్అండ్బీ అధికారులు కూడా దృష్టి సారించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మసిపూసి మారేడు కాయ చేసి మమ అనిపించారు. ఐదు నెలలకే మరలా గుంతలు పడటంతో పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. నాసిరకం తారు వాడటం వల్లే రహదారులకు చేసిన మరమ్మతులు వెంటనే దెబ్బతిన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇంత దారుణంగా గతంలో ఎన్నడూ మరమ్మతు పనులు చేయలేదని రాజకీయ వర్గాలు సైతం చర్చించుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాధనాన్ని దోచుకోవడమే లక్ష్యంగా అధికారులు, కాంట్రాక్టర్లు, పాలకులు పనిచేస్తున్నారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రూ.35 లక్షలతో మరమ్మతులు

నూజివీడు పట్టణం నుంచి మైలవరం వెళ్లే రోడ్డులో ట్రిపుల్ ఐటీ వరకు ఉన్న గుంతలను పూడ్చేందుకు రూ.15 లక్షలు, తుక్కులూరు నుంచి పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా విస్సన్నపేట రోడ్డులోని బైపాస్ రోడ్డు వరకు గుంతలు పూడ్చేందుకు రూ.20 లక్షలను మంజూరు చేశారు. ఈ పనులను ఇరువురు కాంట్రాక్టర్లు చేపట్టి పూర్తి చేశారు. అయితే ఈ మరమ్మతు పనులు కాస్తా ఐదు నెలలకే ధ్వంసమై మరలా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రెండు రోడ్లపై మరమ్మతు పనులు నాసిరకంగా చేయడం వల్లనే దెబ్బతిన్నాయనేది జగమెరిగిన సత్యం. దీంతో రూ.35 లక్షల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైనట్లయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పలు రోడ్లపై చేసిన మరమ్మతు పనులు నేటికి చెక్కు చెదరకుండా ఉండటంతో అప్పట్లోనే పనులు నాణ్యతగా చేశారనే అభిప్రాయాన్ని సైతం స్థానికులు పేర్కొంటున్నారు.

ఎక్కడి గుంతలు అక్కడే



నూజివీడు పట్టణంలో గుంతలు ఎక్కడ పూడ్చారో తెలియదు. ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయి. ఎక్కడన్నా పూడ్చినా ఐదు నెలలు గడవక ముందే తారు అంతా లేచిపోయి కంకర బయటపడింది. గుంతలు పూడ్చి తారు వేస్తే కనీసం ఏడాదైనా ఆగుతాయి. దీనిని బట్టే నాణ్యత ప్రమాణాలను ఎంతగా పాటించారో అర్థమవుతోంది.

– పాలేటి సుబాష్‌చంద్రబోస్, సీపీఎం నూజివీడు మండల అధ్యక్షుడు

నాణ్యత లేకుండానే పనులు



తారురోడ్లపై గుంతలు పూడ్చే పనులను అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేశారు. నాసిరకం తారుతో చేయడం వల్లనే ఐదు నెలలకే మరలా గంతలు పడ్డాయి. దీనివల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయినట్లయింది. నూజివీడులో విస్సన్నపేట రోడ్డు, జంక్షన్ రోడ్డులో గంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాలలో ఆహారాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా విద్యార్థినులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రతి రోజూ పెట్టే అల్పాహారం, భోజనం ఎలా ఉంటుందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు అందించే భోజనాన్ని శుచిగా, రుచిగా తయారు చేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ చదువుకునే విద్యార్థినులందరూ పేద వర్గాలకు చెందిన వారేనని, వారిని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆర్. లక్ష్మీకి సూచించారు.

5న ఉపాధ్యాయులకు సన్మానం

మైలవరం: ఉపాధ్యాయ దినోత్సవం మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5న ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంఈఓలు ఎల్.బాలు, బి. రాజు బుధవారం తెలిపారు. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి అధ్యక్షతన పలువురు ఉపాధ్యాయులను సన్మానిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

కొండవాగు పరిశీలన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బాలకృష్ణ థియేటర్ సమీపంలో ఎగువన ఉన్న కొండవాగు ప్రవాహ ప్రాంతాన్ని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ మౌస్మి, స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించారు. వర్షం పడిన ప్రతిసారి కొండపై నుంచి వచ్చే వర్షం నీరు థియేటర్ ప్రాంతాన్ని ముంపునకు గురిచేస్తోంది. కొండవాగు నుంచి వచ్చే వర్షం నీరు పారుదలకు 30వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన డ్రెయినేజీలు ఆక్రమణకు గురికావడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని గతంలో స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ చిట్టిబాబు తెలిపారు.

దివ్యాంగ చిన్నారులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ

ఇబ్రహీంపట్నం: పోషకాహార వారోత్సవాల్లో భాగంగా స్థానిక దివ్యాంగుల ఆశ్రమంలో నిమ్రా ఫార్మసీ కళాశాల విద్యార్థులు, చిన్నారులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులకు వీటిని బుధవారం అందజేశారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తీసుకునే ఆహారంలో ప్రొటీన్స్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ వంటి పోషక పదార్థాలు ఉండాలన్నారు. మానవ శరీరం ఎదుగుదలకు వాటి అవసరం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఆశ్రమ నిర్వాహకులు, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై డంపర్ బిన్



నూజివీడు: పట్టణంలోని బ్యాంకు స్ట్రీట్‌లో హెడ్ పోస్టాఫీసు సమీపంలో నడిరోడ్డుపైనే డంపర్‌బిన్‌ను ఉంచడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిత్యం కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. డంపర్‌బిన్‌లోని చెత్తను ట్రాక్టర్లలో వేసుకెళ్లి తరువాత దానిని పక్కకు జరిపి పెట్టకుండా నడిరోడ్డుపైనే వదిలేసి వెళ్లడంతో ప్రజల రాకపోకలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో డంపర్‌బిన్‌ను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెళ్లిరా గణపయ్యా..



మైలవరం: రెడ్డిగూడెం అంకమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో మెట్టగూడెంలో ఏర్పాటు చేసిన గణనాథుని బుధవారం నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుని ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అంకమ్మ తల్లి దేవస్థానం వద్ద గణనాథుని 17 కిలోల లడ్డూ ప్రసాదం వేలం పాటను రూ.71,500లకు మల్లెల రవితేజ సొంతం చేసుకున్నారు.

చాట్రాయి: చాట్రాయి గ్రామంలో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు డప్పు వాయిద్యాల నడుమ రంగులు చిమ్ముకుంటూ వినాయక విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

అన్నసమారాధన

నూజివీడు: స్థానిక మైలవరం రోడ్డులోని మునలి రామమందిరం వద్ద నిర్వహిస్తున్న గణపతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు, గణపతి హోమం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణానికి చెందిన పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

తిరువూరు: అసంఘటిత కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో తిరువూరు మండల సీఐటీయూ మహాసభ బుధవారం జరిగింది. భవన కార్మికులకు లేబర్ కోడ్స్ రద్దుచేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పంచాయతీ కార్మికులకు రూ.15 వేల కనీస వేతనం ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు. ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు విడుదల చేయాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇజ్రాయేలు, వెంకటేశ్వరరావు, సీపీఎం, ప్రజా నాట్యమండలి నాయకులు నాగేంద్రప్రసాద్, రవి, నాగమణి, తులసీరాణి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. మండలంలోని ముక్కొల్లుపాడులో తహసీల్దార్ గుగులోతు బద్రూ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన సర్వే నంబర్లు నోషనల్ ఖాతాలో ఉండటం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు తన దృష్టికి తెచ్చారన్నారు. ఎవరి భూములైతే నోషనల్ ఖాతాలో ఉన్నాయో వారందరూ అర్జీలు పెట్టి వారి దగ్గర ఉన్న డాక్యుమెంట్లు సమర్పిస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సాదాబైనామా కింద ఉన్న భూములకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ కంచర్ల సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కలగర వెంకటేశ్వరరావు, ఆర్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ గృహాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు

నూజివీడు: ఇల్లు లేని పేదలకు ఇల్లు కట్టించాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖ సిబ్బందిపై ఉందని ఏలూరు జిల్లా హౌసింగ్ పీడీ జి. సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని హౌసింగ్ ఈఈ కార్యాలయంలో బుధవారం డివిజన్‌లోని ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బేస్‌మెంట్ లెవెల్ నుంచి శ్లాబ్ దశ వరకు వివిధ దశల్లో ఉన్న గృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. దీనికి గాను లబ్ధిదారులను చైతన్యం చేసి మిగిలిన బిల్లు రావాలంటే కచ్చితంగా నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిందేనని అవగాహన కల్పించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం నుంచి కూడా బిల్లులు పెద్దఎత్తున మంజూరు కావాల్సి ఉందని, వాటిని కూడా మంజూరయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నూజివీడు రూరల్‌లో ఒక్క వర్క్ ఇన్‌స్పెక్టర్ కూడా లేని నేపథ్యంలో లింగపాలెంలో ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నూజివీడు మండలంలో పనిచేయాలని ఆదేశించారు. రూఫ్ లెవెల్‌లో ఉన్న గృహాలన్నింటిని ఈనెలాఖరు కల్లా పూర్తి చేయించాలని చెప్పారు. కొంత వరకు నిర్మించి నిర్మాణ పనులను నిలిపివేసిన గృహాలన్నింటిని సందర్శించి లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి వాటి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. డీఈ రామోజీ నాయక్, పలు మండలాల ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మణరావు

ఇబ్రహీంపట్నం: లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎ.చంద్రశేఖర్ బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వచ్చే మైనర్లు లైసెన్సు, వాహన రికార్డులు లేకుండా 30వ నంబర్, 65వ నంబర్ జాతీయ రహదారులపై అతివేగంగా బైకులు నడపడాన్ని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పలుమార్లు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండేవరకు కుటుంబ సభ్యుల బైక్‌లు తోలవద్దని సూచించారు. ప్రమాదాలు జరిగితే మీతోపాటు ఇతరులు కూడా నష్టపోతారని హెచ్చరించారు. తొలిసారిగా కౌన్సెలింగ్‌తో సరిపెట్టామని, మరోసారి పట్టుబడితే చట్టప్రకారం జరిమానా, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

రోడ్లు వేస్తేనే బస్‌లు నడపగలం





మైలవరం-నూజివీడు ఆర్ అండ్ బీ రహదారిలో ఏర్పడిన గుంతలు

ఎన్టీఆర్ జిల్లా హయర్ బస్‌ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

మైలవరం: మైలవరం మార్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఈ రూట్‌లో బస్‌లు నడపడం చాలా కష్టంగా ఉందని ఉమ్మడి కృష్ణా జిల్లా హయర్ బస్సుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్ద పెద్ద గుంతలతో కూడిన రోడ్ల వలన బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బస్‌ల డ్రైవర్లు కూడా నడుము నొప్పి కారణంగా విధులకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు బాగు చేస్తేనే బస్‌లు నడపగలమని స్పష్టంచేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నియమించారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడిగా కుక్కమళ్ల చిన్నబాబు, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా మలిశెట్టి శరత్‌బాబు (బాబి), వాలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా నందూరి భాస్కర్ శర్మ, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా గుడిమళ్ల సామ్రాట్, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా కవులూరి యోగి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా గద్దం నరసింహారెడ్డిలను నియమించారు.

యూరియా కోసం పడిగాపులు

- గ్రోమోర్ కేంద్రాల్లో స్టాకు వస్తుందంటున్న అధికారులు
- ప్రైవేటు డీలర్ల సహాయ నిరాకరణ
- ఆందోళనలో రైతులు



కంభంపాడు గ్రోమోర్‌లో యూరియా కోసం రైతుల నిరీక్షణ

తిరువూరు: ఖరీఫ్ పంటలకు ప్రస్తుత తరుణంలో అత్యవసరమైన యూరియా సరఫరా లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 32 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, 50కి పైగా ప్రైవేటు ఎరువుల వ్యాపారులు ఉండగా ఎక్కడా యూరియా స్టాకు లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు అన్ని సహకార సంఘాల నుంచి ఇండెంట్లు తీసుకున్న వ్యవసాయ శాఖ ఇంతవరకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయలేకపోయింది. తిరువూరు, కంభంపాడు గ్రోమోర్ దుకాణాల వద్ద రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడితే ఒక బస్తా యూరియా దొరకడం కష్టంగా ఉంది. ఎకరాకు 2, 3 బస్తాలు వేయాల్సి ఉన్నప్పటికీ గత రెండు విడతలుగా ఒక్కొక్క రైతుకు ఒక్కో బస్తా చొప్పున మాత్రమే యూరియా ఇస్తున్నారు. ప్రైవేటు డీలర్లు సైతం మొదట్లో కొంత ఎక్కువ ధరకు యూరియా అమ్మినప్పటికీ విజిలెన్స్ తనిఖీలు, అధికారుల తనఖీలు ముమ్మరం చేయడంతో అసలు స్టాకు పెట్టకుండా సహాయ నిరాకరణకు దిగారు.

దుకాణాల వద్ద పడిగాపులు

పొట్ట దశలోకి రానున్న వరిపైర్లకు యూరియా తప్పనిసరిగా వేయాల్సి ఉండగా.. ఎప్పటికి పూర్తిస్థాయిలో అందిస్తారో అధికారులు చెప్పలేకపోతున్నారు. తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండగా, అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. గత 15 రోజులుగా యూరియా కొరత తీవ్రంగా ఉండగా రెండు రోజులుగా కొన్ని సహకార సంఘాలకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. నడిం తిరువూరు, గొల్లమండల, కోడూరు, పోలిశెట్టిపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, గంపలగూడెం సహకార సంఘాలకు, గ్రోమోర్ దుకాణాలకు 80 టన్నుల యూరియా రాగా, ప్రతి రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వగలిగారు. మరో 150 టన్నుల యూరియా కూడా 2, 3 రోజుల్లో వస్తుందని అధికారులు చెబుతున్నారు. అవసరానికి తగినంత యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

అందరికీ యూరియా అందిస్తాం

రైతుల అవసరాలకు తగినంత యూరియా సరఫరా చేస్తాం. ఇప్పటికే అన్ని సొసైటీలకు ప్రాధాన్యతా క్రమంలో యూరియా పంపుతున్నాం. రైతులు ఇబ్బందికి గురికాకుండా ఏర్పాటు చేస్తాం.

– రంగారావు, తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు

యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

జి.కొండూరు: యూరియాని కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ సూరిబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల సరఫరాపై ప్రైవేటు ఎరువుల దుకాణాల యజమానులు, సహకార సొసైటీల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మండల పరిధిలోని కవులూరు సహకార సొసైటీలో 20 మెట్రిక్ టన్నుల యూరియా, వెలగలేరు సహకార సొసైటీలో 15 మెట్రిక్ టన్నులు, వెల్లటూరు సహకార సొసైటీలో 10 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ సెంటర్‌లో 15 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా అవసరం ఉన్న రైతులు ప్రభుత్వ ధరకే యూరియాని పొందవచ్చని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఈదులగూడెం, కృష్ణవరం, ఆగిరిపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను, గ్రోమోర్ ఎరువుల కేంద్రంలోని ఎరువుల నిల్వలను బుధవారం మండల వ్యవసాయ అధికారి జె. భవాని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 48.50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అడవినెక్కలం, ఈదర సహకార కేంద్రాల్లో గురువారం నుంచి యూరియా లభిస్తుందని చెప్పారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంతో మహిళల అవస్థలు



ఆగిరిపల్లి నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సులో ఫుట్‌పాత్‌పై ప్రయాణం చేస్తున్న మహిళలు

ఆగిరిపల్లి: స్త్రీ శక్తి పథకం పేరుతో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ఆర్భాటంగా ప్రారంభించినా అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకపోవడంతో మహిళలకు ఇక్కట్లు తప్పడం లేదు. సమయానికి బస్సులు ఉండకపోవడం, సీట్లు దొరకకపోవడంతో మహిళలు ఫుట్‌పాత్‌లపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఆగిరిపల్లి నుంచి విజయవాడకు ప్రతి రోజూ వందల మంది ప్రయాణిస్తారు. ఆగిరిపల్లి బస్టాండ్ నుంచి విజయవాడ వెళ్లడానికి గతంలో 15 నిమిషాలకు ఒక బస్సు ఉండేది, స్త్రీ శక్తి పథకం మొదలైనప్పటి నుంచి ఉచిత బస్సు ప్రయాణానికి గంట సమయం అయినా సరే బస్సులు రావడం లేదు. వచ్చిన బస్సులో సీటు దొరక్కపోగా, కనీసం నిలబడడానికి కూడా స్థలం ఉండడం లేదు. దీంతో ప్రమాదమని తెలిసినా ఫుట్‌పాత్‌పై ప్రయాణం చేయాల్సి వస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం ఏమోగానీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దీకి తగినట్లుగా బస్సు సర్వీస్‌లు పెంచాలని మహిళలు కోరుతున్నారు.

సబ్ జైలును పునఃప్రారంభించాలి

తిరువూరు: తిరువూరులో గతంలో మూసివేసిన సబ్ జైలును తిరిగి ప్రారంభించాలని రాష్ట్ర హోం మంత్రి అనితను స్థానిక ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు కోరారు. బుధవారం అమరావతిలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.


రాష్ట్రంలో మారుమూల ఉన్న తిరువూరులో సబ్ జైలు లేక విచారణ ఖైదీలను దూర ప్రాంతాలకు తరలించడంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సబ్ జైలును తిరిగి తెరిస్తే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు.

గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రణాళిక

చాట్రాయి: గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేయాలని ఐటీడీఏ డిప్యూటీ ఎంఈఓ రవి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆది కర్మయోగి పథకంపై నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన గ్రామాలు 2030లోగా అభివృద్ధి జరిపే అంశంపై చర్చించామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డీటీ ఈశ్వరరావు, డాక్టర్ దుర్గాప్రసాదు, ఎంఈవో బ్రహ్మాచారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రఘు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ బంగారు రాజు



మూలపాడు(ఇబ్రహీంపట్నం): రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ బంగారు రాజు హెచ్చరించారు. మూలపాడు పీఏసీఎస్‌లో యూరియా దిగుమతి, పంపిణీ, స్టాక్ వివరాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, ఈపాస్ మిషన్లను పరిశీలించారు. డీలర్ల నుంచి వస్తున్న యూరియా సన్నచిన్నకారు రైతులకు అందాలని సూచించారు. గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, మూలపాడు పీఏసీఎస్‌లకు వచ్చిన యూరియా రైతులకు పంపిణీ చేశామని, ఈలప్రోలు సొసైటీకి లోడ్ ఆర్డర్ పెట్టామని ఏఓ రజని డీఎస్పీకి తెలిపారు. విజిలెన్స్, పీఏసీఎస్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

చాట్రాయి: చీపురుగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ పనులు బుధవారం చేపట్టారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో దోమల మందు ఫాగింగ్ చేశారు. సర్పంచ్ ఓబిళ్లనేని సరోజిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.